క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల నిరసన



బోధన్: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లోకి బస్సులు, ఆటోలు రాకపోకలకు ఇబ్బంది ఉన్న ఓ పండ్ల విక్రయ తోపుడు బండిని తొలగించాలని ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ నిరసన తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో అధికారికి వినతి పత్రం అందించారు.తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో గతంలో చేపట్టిన సిమెంట్ రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే ఫిర్యాదులు రావడంతో ఉన్నత అధికారులు క్వాలిటీ కంట్రోల్ అధికారులను పరిశీలనకు పంపారు. అందులో భాగంగా బుధవారం క్వాలిటీ కంట్రోల్ డీఈ సురేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. సీసీ రోడ్డు నమూనాలను సేకరించారు. త్వరలోనే పూర్తి స్థాయి నివేదిక అందించాలన్నారు. ఆయన వెంట పీఆర్ఏఈ షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా సాగుతున్న క్రీడా పోటీలు

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు బుధవారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి. విద్యార్థులు క్రీడాల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్ పోటీలు నువ్వా, నేనా అన్నట్లుగా సాగాయి. గురువారం క్రీడల ముగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో 30 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

పరామర్శ

కమ్మర్‌పల్లి: నర్సాపూర్ గ్రామానికి చెందిన జనార్దన్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అదేవిధంగా ఇప్ప గంగాధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, సంజీవ్, గణేష్, రాకేష్, లింబాద్రి, ప్రదీప్, రాజేందర్ తదితరులున్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఆనంద్ కుర్చీలను వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుర్చీలను హెచ్ఎం గంగాధర్‌కు అందజేశారు. అదే పాఠశాలకు చెందిన మమత అనే టీచర్ పాఠశాలకు రూ. 5 వేలు విరాళంగా అందజేశారు.

పారిశుధ్య కార్యక్రమాలు

మోర్తాడ్: సీజనల్ వ్యాధుల నివారణ కోసం గ్రామాలలో జోరుగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను కార్యదర్శులు పరిశీలిస్తున్నారు. ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్‌లు గ్రామాలలో సాగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తున్నామని వెల్లడించారు.

ఆర్థిక సాయం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్‌కు రూ.11 వేల చెక్కును జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీవో వారిని అభినందించారు. ఖమ్మంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి తమ వంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నామని, జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సభ్యులు సత్యనారాయణ గౌడ్, కొంతం రాజు ఉన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు ప్రణాళికలతో చదువుతూ ముందుకుసాగితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలంగాణ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ కెమిస్ట్రీ చైర్‌పర్సన్ డాక్టర్ జి.బాలకృష్ణ అన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులు కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్, సమన్వయకర్తలు డాక్టర్ సునీత, లింగం, జాన్ సుకుమార్, అంబర్‌సింగ్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి
- రోడ్ల మరమ్మతుతో పాటు వీధి దీపాలను అమర్చాలి
- సిబ్బందికి అధికారుల సూచన



ఆర్మూర్‌లో నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి



బాల్కొండ ఊర చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్: పట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజుకు సూచించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని గూండ్ల చెరువు, పెర్కిట్, మామిడిపల్లి చెరువుల వద్ద ఏర్పాట్లను ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో చెరువుల వద్దకు వెళ్లడానికి రోడ్ల మరమ్మతుతో పాటు వీధి దీపాలను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. క్రేన్‌లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సీఐ రవి కుమార్, తహసీల్దార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై నరేష్‌లు బుధవారం పరిశీలించారు. గ్రామ శివారులో ఊర చెరువులను పరిశీలించారు. చెరువు వద్ద లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: మండల కేంద్రంలోని వినాయకులను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో సురేష్ బాబు, ఎస్సై సాయన్న పరిశీలించారు. మండల కేంద్రంలో పలు గణనాథులను బుధవారం నిమజ్జనం చేయనుండడంతో వారు స్థానిక చెరువు కట్ట వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. జీపీ కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

బోధన్‌లో నిమజ్జన ప్రాంతాల పరిశీలన



బోధన్‌లో నిమజ్జన బావి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: వినాయక నిమజ్జన శోభాయాత్ర, నిమజ్జన ప్రాంతాల్లో అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలకు ఉపక్రమించింది. బుధవారం పట్టణ కేంద్రంలో సాగే వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని, వివిధ ప్రాంతాల్లో నిమజ్జన స్థలాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. రైల్వేగేట్ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని వినాయకుడి బావి, పట్టణ కేంద్రం నుంచి బాన్సువాడ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న పసుపు వాగువద్ద వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ,తహసీల్దార్ విఠల్, టౌన్, రూరల్ సీఐలు వెంకట నారాయణ, నరేష్, కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం



మోర్తాడ్: మోర్తాడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు బుధవారం శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈనెల 14 నుంచి సికింద్రాబాద్‌లోని రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 43వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ అధ్యక్షత వహించగా ఎస్సై విక్రమ్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

రుద్రూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. కోటగిరిలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 76వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా నాటి తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనం కాలేదన్నారు. ఆనాటి నిజాం పాలనకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నాలుగు వేల మంది సీపీఐ కార్యకర్తలు ప్రాణాలు పోగొట్టుకున్నారని, వారి పోరాట ఫలితంగానే 3,500 గ్రామాలు వెట్టి చాకిరి నుంచి విముక్తి అయ్యాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు 76వ వార్షికోత్సవాలు జరుగుతాయని, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగానే తెలంగాణలో కూడా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరులను స్మరిస్తూ సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, సీపీఐ బాన్సువాడ నేత దుబాస్ రాములు, నేతలు అంబటి విఠల్ గౌడ్, నల్లగంగాధర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బతుకు పోరాటం



వరద గేట్ల ముందర చేపల వేట సాగిస్తున్న జాలర్లు



చిక్కిన చేపలను తీసుకురావడానికి తాడు ద్వారా కిందకు దిగుతున్న మత్స్యకారుడు

బాల్కొండ: పూట గడవడం కోసం చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు నీటితో సహవాసం చేస్తూ.. చేపలతో సహజీవనం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన వరద గేట్ల ముందర చేపల వేటకు ఇద్దరు మత్స్యకారులు వెళ్లా రు. అప్పటికే 5 వరద గేట్ల ద్వారా 15 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ఈ క్రమంలో ఉదయం 11 గంటల తరువాత నీటి విడుదల పెంపుదల కోసం సైరన్ మోగించారు. దీంతో వరద గేట్ల ముందర ఉన్న ఇద్దరు జాలర్లు పరుగు పరుగున చిక్కిన చేపలను అక్కడనే వదిలి వేసి తెప్పపై గోదావరిలోకి ముందుకు వెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ ఒడ్డుకు చేరుకున్నారు. తరువాత మళ్లీ ఎస్కేప్ గేట్ల వద్ద తాడుతో నిచ్చెన ఏర్పాటు చేసుకుని గోదావరిలోకి దిగారు. అదే సమయంలో 9 వరద గేట్లను ఎత్తి నీటి విడుదలను పెంచారు. అయినా జాలర్లు పట్టు వీడకుండా చేపల బస్తాను భుజాన ఎత్తుకుని తాళ్ల నిచ్చెన వద్దకు వచ్చి చేపలను పైకి పంపించాడు. ఇలా మత్స్యకారులు ఏటికి నీటికీ ఎదురీదుతున్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

వర్ని: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఈ విషయంలో భోజన ఏజెన్సీ నిర్వాహకులు, హాస్టల్ నిర్వాహకులు ఎక్కడైనా పొరపాట్లకు తావిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వర్ని ఎంపీడీవో వెంకటేష్ హెచ్చరించారు. బుధవారం కోటయ్య క్యాంపులోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. ఏరోజుకారోజు తాజా కూరగాయలను తీసుకువచ్చి మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెట్టాలని సూచించారు. తహసీల్దార్ సాయిలు ఉన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల నిర్వహించిన ఆర్మూర్ మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇస్సాపల్లి విద్యార్థులను ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ అభినందించారు. పోటీల్లో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ప్రశంసా పత్రాలను అందుకున్నారు. దీంతో చైర్మన్ విద్యార్థులను అభినందించారు. ఎంఈవో రాజ గంగారాం, నాయకులు డీసీ ముత్తెన్న, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో విద్యుత్, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి నీటిలో మునిగిన వారిని ఎలా కాపాడాలో, అగ్ని, విద్యుత్ ప్రమాదాలు జరిగినపుడు ఎలా రక్షించుకోవాలనే విషయాలను ప్రత్యక్షంగా వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ లక్కారం ప్రసాద్, లక్కారం సాగర్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పేందుకు సహకరిస్తాం



అలీప్ సంస్థ ప్రాంగణంలో జనపనార సంచులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: మహిళల ఆర్థిక స్వాలంబన, జీవోపాధి లక్ష్యంగా నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అలీప్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. పెంటాకుర్దు క్యాంప్‌లో స్వయం సహాయక మహిళా సంఘ సభ్యులకు అలీప్ సంస్థ కుట్టు శిక్షణ ఇచ్చింది. ఇటీవల ఈ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించిన సందర్భంగా హైదరాబాద్‌లోని అలీప్ సంస్థను సందర్శించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల వివరాలు, వాటి నిర్వహణ అంశాల అధ్యయనం కోసం వెళ్లాలని మహిళలకు సూచించారు. ఈ మేరకు సంస్థను సందర్శించేందుకు మహిళలను బుధవారం పంపించారు. ఎమ్మెల్యే అలీప్ సంస్థ కార్యాలయాన్ని సందర్శించి పెంటాకుర్దు గ్రామ మహిళలతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

ఉపాధ్యాయ దినోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో 27 ఏళ్లుగా సేవలందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్‌ను కాంతి గంగా రెడ్డిని డైరెక్టర్ శశాంక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నవీపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 30 మంది ఉపాధ్యాయులను ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గణేష్‌రావ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల నాయకులు శివకుమార్, మన్మారెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మాక్లూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మైపాల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్ పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి

ఆర్మూర్: ఇజ్రాయిల్‌లో ఇజ్రాయిల్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. దొరలపై తిరగబడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన చాకలి ఐలమ్మను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకం అని వక్తలు కొనియాడారు. సంఘం నేతలు చట్ల మల్లయ్య, ముంబై నారాయణ, కొండయ్య, రాజేష్, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి



మైనార్టీ నేతలతో మాట్లాడు

బోధన్: గణేష్ నిమజ్జన శోభాయాత్ర, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీసులో వివిధ రాజకీయ పార్టీల మైనార్టీ నాయకులతో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్‌లు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వారితో పండుగలు సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మైనార్టీ నాయకులు సబ్ కలెక్టర్, ఏసీపీలను శాలువాలతో సన్మానించారు. తహశీల్దార్ విఠల్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనండి

నిజామాబాద్ రూరల్: ఆర్‌బీఐ స్థాపించి 90 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ అశోక్ తెలిపారు. బుధవారం లీడ్ బ్యాంక్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 17లోగా ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సొసైటీ అక్రమాలపై విచారణ జరిపించాలి



ఫిర్యాదు చేస్తున్న రైతులు

వేల్పూర్: పడగల్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు బుధవారం డిమాండ్ చేశారు. సొసైటీలో 20 ఏళ్లుగా సిబ్బంది రైతులను మభ్యపెడుతూ దీర్ఘకాలిక రుణాలు ఇప్పిస్తూ మోసానికి గురి చేశారని విచారణ అధికారి మురళికి ఫిర్యాదు చేశారు. దోచుకుంటున్నారని మాజీ చైర్మన్ కొట్టాల చిన్నారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఇటీవల ఆయన విచారణ అధికారి నియమించారు. విచారణ అధికారి సొసైటీకి రావడంతో కోమన్‌పల్లి, పడగల్, కుకునూర్, అంక్సాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తరలివచ్చి విచారణ అధికారి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీర్ఘకాలిక రుణాలు తమకు తెలియకుండా తమ పేరుపై తీసుకున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



రుద్రూర్‌లో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

రుద్రూర్: కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుల నిమజ్జనోత్సవ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. రుద్రూర్ మండల కేంద్రంలో శ్రీ చౌడేశ్వరి గణనాథుడు, స్నేహ కిరణం గణేష్ మండలి, శ్రీ సిద్ది వినాయక గణేష్ మండలి, శ్రీ శివాజీ గణేష్ మండలి, శ్రీ శక్తి గణేష్ మండలి, రజక యూత్ గణేష్ మండలి గణనాథులు, చిక్కడపల్లిలో వరసిద్ధి గణేష్ మండలి,అంబం (ఆర్)లో బాల గణేష్ మండలి వినాయకుల నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. గణనాథులను రాత్రి స్థానిక చెరువులో నిమజ్జనం చేయగా, మరికొన్నింటిని తెల్లవారు జామున నిమజ్జనం చేస్తామని గణేష్ మండలి సభ్యులు తెలిపారు.

హైడ్రా మాదిరి నిడ్రా ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కేశవులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, పార్కులను కాపాడటానికి 'హైడ్రా' తరహాలోనే 'నిడ్రా'ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని ఖలీల్‌వాడిలో గల డాక్టర్ కేశవులు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ' జిల్లాలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలు - నిడ్రా ఏర్పాటు' అంశంపై అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు మాట్లాడుతూ.. నగరంలోని పూలాంగ్ వాగుతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి ప్రాంతాల్లోని చెరువుల శిఖాలు, నిజాంసాగర్ కాల్వ కట్టల వద్ద కబ్జాలపై గతంలోనే ఫిర్యాదులు వచ్చినప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమనారు. నగర శివారులోని నిజామాబాద్- బోధన్ రహదారి పక్కనే రామర్తి చెరువు విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు కాగా ప్రస్తుతం 15 ఎకరాలు కూడా లేదన్నారు. భీమ్‌గల్‌లో దాదాపు 73 ఎకరాల విస్తీర్ణంలోని రాథం చెరువు శిఖం ప్రాంతం 10 ఎకరాలకు మించి ఆక్రమణలను గుర్తైందన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. వెంటనే జిల్లాలో 'నిడ్రా'ను ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె భూమన్న, సీనియర్ జర్నలిస్ట్ బొబ్బిలి నర్సయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్, బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ నాయకులు మురళీ, బీఎల్ఎఫ్ రాష్ట్ర నేతలు దండి వెంకట్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వ్యవస్థపై అవగాహన

బోధన్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ) విద్యార్థులకు విద్యుత్ సరఫరా వ్యవస్థపై అవగాహన కల్పించారు. పాఠశాల కంప్యూటర్ టీచర్ శాంతి బుధవారం ఇన్నరేషన్ టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం పట్టణ శివారులోని బెల్లాల్ విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శనకు విద్యార్థులకు తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా తీరును విద్యార్థులకు వివరించినట్లు టీచర్ తెలిపారు.

మేము రైతు బిడ్డలం

మోర్తాడ్: వ్యవసాయం చేసే రైతన్నల చిన్నారులు మేము రైతుబిడ్డలం అంటూ గొప్పగా చెప్పుకోవడమే కాదు. ప్రతి ఏటా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఫార్మర్స్ సన్స్ అండ్ డాటర్స్ అనే పేరుతో మోర్తాడ్‌లోని మున్నూరువాడలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి రోజూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు చిన్నారులు. తమ తల్లిదండ్రుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించి అందరితో శభాష్ అనిపించుకున్నారు.

అన్నదానం

కమ్మర్‌పల్లి: మండలంలోని పలు వినాయక మండపాల వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. ఉప్లూర్ బద్దం వాడ సంఘం గణేష్ మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు.

బాల గణేష్ మండపంలో..

బోధన్: పట్టణ కేంద్రంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ బాల గణేష్ మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు, పెద్ద ఎత్తున్న అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.మండలి సభ్యులు, బాలలు స్మితేష్, సాత్విక్, సుమిత్ పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 -	నరిపోదా శనివారం (తెలుగు) - 10.25, 2.00, 5.35, 35-చిన్న కథ కాదు - 9.10
స్క్రీన్-2 -	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు)- 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3 -	35-చిన్న కథ కాదు - 12.00, 3.05, 6.10, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ - 9.15
స్క్రీన్-4 -	నరిపోదా శనివారం- 11.30, 3.05, 6.40, 10.15

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతాపషియన్) నిజామాబాద్

స్క్రీన్-1	35 చిన్నకథ(తెలుగు)-10.10 నరిపోదా శనివారం(తెలుగు)- 12.55, 7.15,10.25
స్క్రీన్-2	గ్రేటెస్ట్(తెలుగు)-10.00,7.10,10.35 35: చిన్నకథ(తెలుగు)-1.30,4.20
స్క్రీన్-3	గ్రేటెస్ట్(తెలుగు)-12.40 4.10 35 చిన్నకథ(తెలుగు)- 7.40 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	35-చిన్నకథ(తెలుగు)-12.30 నరిపోతు శనివారం -3.35,10.30 స్త్రీ-2(హిందీ)-7.10
స్క్రీన్-2	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్(తెలుగు)- 10.30,2.15,6.00,9.45
స్క్రీన్-3	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్(తెలుగు)-12.15 35-చిన్నకథ -4.00,7.05,10.10
స్క్రీన్ -4	స్త్రీ-2(హిందీ)-1.10 ,4.25,10.15 స్పీడ్-220(తెలుగు)-7.40
లలితామహాల్	నరిపోదా శనివారం(తెలుగు)
దేవి	ది గోట్(తెలుగు)
నటరాజ్	గబ్బర్‌సింగ్(తెలుగు)
విజయ్	చిన్నకథ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,200	వెండి (కిలో)	86,500
22 క్యారెట్స్	68,450		

- నిజామాబాద్ బిజినెస్